
# నందుని ఇంట.. ముకుందుని పంట!

బాదరాయణి శుక బ్రహ్మ, పదేపదే స్వాద భరితమైన భాగవతాన్ని సాదరంగా బోధిస్తుండగా.. మేదినీపతి పరీక్షిత్తు మహామోదంతో ఆస్వాదిస్తున్నాడు. శుకుడు.. రాజా! శూరుని కుమారుడు పరమ ఉదారుడైన వసుదేవుడు కారాగృహం చేరి గారాము పట్టి యోగమాయను తన దార– భార్య పక్కన పరుండబెట్టి తన కాళ్లు, చేతులకు సంకెళ్లు తగిలించుకున్నాడు. మాయాపతి మాధవుని సంబంధం వలన సకల బంధవిముక్తి. ఇప్పుడు కారాగృహంలో యోగమాయా సంబంధం వలన జాయాపతులకు (భార్యాభర్తలకు) మరల బంధన ప్రాప్తి!

నందగృహంలో యశోద సాంద్ర(గాఢ) నిద్రలో ఉన్నందున తాను కన్నది కన్యనా, కన్నయ్యనా అన్న విషయం తెలుసుకోలేకపోయింది. ఇక్కడ కారాగృహంలో ఆడపిల్ల బిగ్గరగా ఏడవగా విని మేలుకొన్న కావలి వారు ఆవులిస్తూ కంసునికి పురిటివార్త అందించారు. అతడు తత్తరపడుతూ ఉత్తరీయం వ్రేలాడుతుండగా చెరసాలలో ప్రవేశించి మత్తుడై కత్తిదూసి, దేవకి గుండెకి హత్తుకొన్న మహత్తు (మహిమ)గల ఆడపిల్లను– యోగమాయను, లాగుకొని చంపబోయాడు. దేవకి అడ్డుతగిలి.. 'అన్నా! మేనల్లుడు కాదు. ఇది నీ మేనకోడలు. చంపవద్దన్నా. మన్నన చేయుమన్నా. నీకు సోదరిని కదన్నా. నిన్ను శరణువేడుతున్నా. నన్ను కరుణించు' అంటూ ఇలా ఎంత బతిమాలినా ఆలకించక అతి భీతి (భయం)తో మతి తప్పిన ఆ భోజపతి– కంసుడు పసి కూన పాదాలు పట్టుకొని పైకెత్తి కసిగా నేలమీద విసిరికొట్టాడు. ఆ పాప కిందపడక పైకి లేచి అష్టభుజ మహాశక్తి స్వరూపిణిగా దర్శనమిచ్చి..




ఉ|| 'తెంపరివై పొరిం బొరిని దేవకిబిడ్డలఁ జన్నికుర్రలం
జంపితి వింకనైన నుపశాంతి వహింపక రాలమీద నొ
ప్పింపగ నిస్సిరో యిదియు బీరమె? నా సరసన్ జనించి నిన్
జంపెడి వీరుఁడొక్క దెస సత్కృతి నొందెడు వాడు దుర్మతీ!'

'ఓరీ! దుర్మార్గుడా! ఈ మహాతల్లి కన్న నా ఆరుగురు అన్నలను మన్నించక వరుసగా చంపిన మొనగాడవు నీవు. ఆడుబిడ్డను చంపడం కూడా ఒక పౌరుషమా? నాకు తోడుగా– నా సరసనే పుట్టిన ఒక వీరుడు మరోచోట, ఓ దుష్టబుద్ధీ! అల్లారు ముద్దుగా పెరుగుతున్నాడు. వాడి చేతిలో నీకు చావు మూడుతుందిలే!' అని హెచ్చరించి ఆయమ (ఆమె) మాయమైపోయింది.

శుకుడు– రాజా! ఆ కలికి (యోగమాయ) పలుకులు చెవుల్లో ములుకులై గుచ్చుకొనగా కంసుడు ఉలికిపడ్డాడు. దేవకీ వసుదేవుల బంధాలు తొలగించి వారితో... 'బావా! వసుదేవా! సోదరీ! దేవకీ! నేను మీ పసిబిడ్డలను పొట్టన పెట్టుకొన్న శిశు హంతకుడను. నా పాపాలు లెక్కచేయక నాపై కృప చూపండి. నిక్కముగా– నిజానికి నేను హంతనూ కాదు. మీ బిడ్డలు హతులూ కారు. 'నాయం హంతి న హన్యతే' (గీత). ఆత్మ సంహరించేది కాదు, సమసేదీ కాదు. అంతా భ్రాంతి మాత్రమే! ఇవన్నీ కర్మబంధాలే సుమా!' అంటూ వేదాంత ధోరణి వెలిబుచ్చి వారికి పాదాక్రాంతుడయ్యాడు.



ఇదిలా ఉండగా మంద (వ్రేపల్లె)లో నందుడు తనకు నందనుడు పుట్టాడని అమంద (ఎంతో) ఆనందం పొందాడు. దూడలతో కూడిన రెండు లక్షల పాడి ఆవులను భాసురమైన బంగారు తొడుగులతో అలంకరించి పాత్రులైన భూసురులకు దానం చేశాడు. పన్నగశాయి కన్నయ్యను తానే కన్న అయ్యగా ఇయ్యకొని (అంగీకరించి) బీదసాదలకు అందరికీ కోరకనే గోవులను, సంపదలను దానమిచ్చాడు. పుత్ర– శ్రీకృష్ణ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని వల్లవులు– గోపకులు పశువులను పసుపు, కుంకుమలతోను, తమ ఇళ్లను పల్లవ– చిగురుటాకుల తోరణాలతోను అలంకరించారు. ఆ శుభ సమయాన వారందరూ నూతన వస్త్రాలను, బంగారు ఆభరణాలను ధరించి మధుర పదార్థాలతో మధువైరి దర్శనానికి విచ్చేశారు. ఎల్లవారిలో ఆనందం వెల్లివిరిసింది. వారంతా సరస సల్లాపాలు కావిస్తూ, నీళ్లతో, నేతులతో, పాలు పెరుగులతో, నవనీతాలతో (వెన్నతో) తనివితీరా వసంతాలాడారు. గోప భామినులైతే ఓపికలు కోల్పోయి పరస్పరం పిలుచుకుంటూ ఇలా ముచ్చటించుకున్నారు...

ఆ|| 'ఏమి నోము ఫలమొ ఇంత ప్రొద్దొక వార్త / వింటి మబలలార! వీను లలర
మన యశోద చిన్ని మగవానిఁ గనెనట / చూచి వత్తమమ్మ సుదతులార!'

'చెలులారా! ఏ నోము ఫలమో కానీ ఈ ప్రొద్దున వీనుల విందుగా ఇంతమంచి వార్త విన్నాము. మన యశోదమ్మ చక్కని మగబిడ్డను కన్నదట ఆ చిన్నారిని కన్నులారా చూచి వద్దాం. త్వరగా తరలి రండి'.

రాజా! గోపికలు కంగారు కంగారుగా సింగారాలు చేసుకొని మందగతులతో ముందుకు సాగుతూ నందుని గృహం చేరారు. వారి జడల నుండి పుష్పాలు కిందికి రాలుతూ.. 'కృష్ణదర్శన లాలస గల మీరు భాగ్యవతులు. మేము మీ తలలపై ఉండి అలరించేటంత యోగ్యత కలవారం కాదు. మీ పాదాలపై పడి ఆ పవిత్ర ధూళి స్పర్శచే మేము పావనమవుతాము' అని తలంచుచున్నట్లు అనిపించింది. చిన్నికృష్ణుని రూపంలో భ్రాజిష్ణు– ప్రకాశించు, జిష్ణు– జయశీలుడైన విష్ణుని కాంచి, సంతోషంతో స్వామికి కానుకలు సమర్పించి, చిరంజీవివై చిరకాలం మమ్ములను కాచి రక్షించవలసిందిగా ప్రార్థించారు. పిమ్మట గోపవనితలు నూనెతో చిన్నిపాపనికి తల అంటారు. పసుపు పూసి, స్నానం చేయించి 'శ్రీరామ రక్ష' అంటూ నీళ్లను చుట్టూ తిప్పి చల్లారు. శిశువును అలంకరించి ఊయలలో ఉంచి దీవించి...




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006


కం|| 'జోజో కమలదళేక్షణ! / జోజో మృగరాజ మధ్య! జోజో కృష్ణా!
జోజో పల్లవ కరపద! / జోజో పూర్ణేందు వదన! జోజో యనుచున్'

'పద్మపత్రాల వంటి నేత్రాలు, సింహపు నడుము వంటి సన్నని నడుము, చిగురుటాకుల వంటి హస్తపాదాలు, పూర్ణచంద్రుని వంటి ముఖము కల ఓ కృష్ణా! నీకు 'జోజో'– అంటూ జోలపాటలు పాడారు.

కం|| 'పలు తోయంబుల జగములఁ / బలు తోయములందు ముంచి భాసిల్లెడి యా
పలుతోయగాడు వల్లవ / లలనా కరతోయములఁ జెలంగుచుఁ దడియన్'

శుకుడు– రాజా! లోకాలను కాపాడడానికి అనేక రకాలుగా అవతరించే మాధవుడు, సృష్టించిన ఆ లోకాలను పలుమారులు ప్రళయకాలంలో అపరిమిత జలాలలో ముంచే (లయింపజేసే), ఆ విరించి జనకుడు మహావిష్ణువు కపట శిశువై సమంచితం (ఒప్పిదం)గా వటపత్రశాయి అయి విరాజిల్లుతాడు. ఆ విష్ణువే ఇప్పుడు వృష్ణివంశ వర్ధనుడైన కృష్ణుడై గోపికల చేతులలో పరిమిత జలాలతోనే వడివడిగా తడిసిపోతున్నాడు.

కం|| 'లోకములు నిదుర వోవగ / జో కొట్టుచు నిదురవోని సుభగుడు రమణుల్
జోకొట్టి పాడ నిదురం / గైకొను క్రియ నూరకుండెఁ గను దెరవకయున్'

'ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః' (ఆదిత్య హృదయం).. లీలామానుష విగ్రహుడైన బాలకృష్ణుడు తన జోలపాటలతోనే సకల లోకాలను (జీవులను) నిద్రపుచ్చుతూ– తన మాయాశక్తితో ఆత్మజ్ఞానమనే జాగృతి లేకుండా చేస్తూ, తాను మాత్రం నిరంతరం జాగృతుడై (మేల్కొనే) ఉంటాడు. అట్టి నిత్య బుద్ధుడు (నిద్రా రహితుడు) శ్రీహరి గోపికల నిష్కామ ప్రేమకు బద్ధుడై– వశీభూతుడై, వారి జోలపాటల లాలింపులకు ఒళ్లు మరచి, కళ్లు మూసుకొని నిద్రలో ఓలలాడుతున్నట్లు నటిస్తున్నాడు నటన సూత్రధారి మురారి!

(సశేషం)




జిందగీ చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 5 ఫిబ్రవరి 2024
15
www.ntnews.com



# పురుషార్థాలు.. పరమార్థం!

**ధర్మం.. పాటించేది.**
**అర్థం.. సంపాదించేది.**
**కామం.. అనుభవించేది.**
**మోక్షం.. సాధించేది.**
**వీటిలో ఒకటి గతి తప్పినా.. మిగిలిన మూడూ అధోగతికి దారితీస్తాయి. ఒకటి శ్రుతిలో లేకపోయినా.. జీవితం లయ తప్పుతుంది. చతుర్విధ పురుషార్థాల పరమార్థాన్ని గ్రహించినప్పుడే.. జన్మకు సార్థకత. జీవితానికి పరిపూర్ణత.**

మానవ జన్మకు నాలుగు ప్రయోజనాలున్నాయని మన సనాతన ధర్మం చెబుతున్నది. వాటిని చతుర్విధ పురుషార్థాలు అని పిలుస్తారు. అవే ధర్మం, అర్థం, కామం, మోక్షం. వీటిలో మోక్షమంటే ఆనందం. శరీరం పొందేది సుఖమైతే, మనసుతో పొందేది సంతోషం, కేవలం ఆత్మతో పొందేది ఆనందం. అది శాశ్వతమైంది. మనిషికి సుఖం, సంతోషం ధర్మార్థకామాల వల్ల కలుగుతాయి. ఆనందం మాత్రం మోక్షం వల్ల దక్కుతుంది. అంటే తొలుత మానవ జన్మ ఎత్తిన వారికి కోరికలు తీరాలి. ఆ కోరికలే కామం. అవి తీరాలంటే ధనం కావాలి. అదే అర్థం. ఆ అర్థాన్ని ఆర్జించేందుకు వ్యవసాయమో, ఉద్యోగమో, వ్యాపారమో చేయాలి. అవి న్యాయబద్ధమై ఉండాలి. అదే ధర్మం. అయితే ధర్మ, అర్థ, కామాలు మోక్షానికి దారి చూపేలా ఉండాలని మన మహర్షులు తెలియజేశారు. పురుషార్థాల పరమార్థం అదేనని ఉద్ఘాటించారు.

## ధర్మో రక్షతి రక్షితః...

ధర్మం అనే శబ్దానికి కర్తవ్యం, విధి అనే అర్థాలు ఉన్నాయి. వృత్తికి న్యాయం చేకూర్చటం ధర్మం. అలాగే లోకశ్రేయస్సును కలిగించేది ధర్మం. ప్రపంచ ప్రయోజనం కోసం మనం ఆచరించే ధర్మం మనకు కూడా రక్షణగా ఉపయోగపడుతుంది. అందుకే 'ధర్మో రక్షతి రక్షితః' అన్నారు. సమాజంలో ధర్మానికి సమాంతరంగా అధర్మ శక్తులు కూడా పనిచేస్తూ ఉంటాయి. విజ్ఞులైన వారు ఆ వ్యతిరేక శక్తులను చూస్తూ నిర్లక్ష్యం చేయకూడదు. ధర్మ పరిరక్షణ చేయకపోతే జాతి నిర్వీర్యమైపోతుంది. అందుకే మన స్వధర్మాన్ని పాటిస్తూ, సామాజిక ధర్మానికి రక్షకులుగా నిలవాలి. మనిషి తన హక్కుగా, ఎంచుకున్న పనిని చేస్తూ, ధనం సంపాదిస్తూ, కోరికలు తీర్చుకుంటూ సంతోషంగా జీవించటమే ధర్మం.



ధర్మవ్యాధుడు మాంసం అమ్ముకునే వ్యాపారి. కానీ తన వృత్తిని అంకితభావంతో చేస్తూ, తల్లిదండ్రుల విషయంలో బాధ్యత కలిగిన కొడుకుగా వ్యవహరిస్తూ, ఆదర్శ గృహస్థుగా జీవించాడు. సర్వసంగ పరిత్యాగులు ఏండ్లుగా తపస్సు చేసి సాధించే బ్రహ్మజ్ఞానాన్ని, గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ పొందగలిగాడు. కష్టాల్లో ధైర్యం కోల్పోక ధర్మం విడువక ఉన్నవారే చరిత్రలో మహనీయులుగా నిలిచిపోయారు. రాముడు పితృవాక్యపరిపాలన అనే ధర్మం ఆచరించకుండా తండ్రిపై తిరుగుబాటు చేసి అయోధ్య నగరాన్ని చేజిక్కించుకొని ఉంటే రామాయణమే ఉండేది కాదు. మనం ఈనాడు ఆయన్ను దేవుడిగా పూజించే వాళ్లమే కాదు! అందుకే 'ధర్మాత్ముడైన భక్తుణ్ని ధనహీనుణ్ని చేసి భగవంతుడు పరీక్షిస్తాడు. ఈ పరీక్షలో నెగ్గటమే ధర్మ రహస్యం' అంటుంది భాగవతం.

## అర్థం.. అనర్థం కావొద్దు..

చతుర్విధ పురుషార్థాల్లో రెండోది అర్థం. అంటే జీవన అవసరాలకు కావలసిన సంపద. పుట్టిన క్షణం నుంచి మనిషి గతించే దాకా అడుగడుగునా ధనం అవసరం. బతుకు తెరువు కోసం సక్రమ మార్గంలో ధనార్జన చేయడమే అర్థం. ఈ పురుషార్థ సాధనలో మనకు జనక మహారాజులాంటి వారే ఆదర్శం. పైకి మహారాజు అయినా.. అంతరంగా ఆయన సన్న్యాసిగా జీవించాడు. అర్థాన్ని పుణ్యకార్యాలకు వినియోగించాలి. అర్థానికి మూడు గతులున్నాయని మన సనాతన ధర్మం చెబుతున్నది. అవి దానం, భోగం, నాశం. ఎవడైతే ఇతరులకు దానం చేయడో, తానూ అనుభవించడో... అలాంటి వ్యక్తి ధనానికి నాశం పడుతుందని సుభాషితం చెబుతున్నది. అందుకే గురుదేవులు రామకృష్ణ పరమహంస 'ఎవడైతే ధనాన్ని బానిసగా చేసుకొని జీవిస్తాడో, అతడే మనిషి. ధనం సద్వినియోగం తెలియని వారు మనుషులు కారు. ధనం మనిషి స్వభావాన్నే మార్చివేసే ఉపాధి. ధనవంతుడు కాగానే అతడి నైజమే మారిపోతుంది' అన్నారు. అర్థమే ధ్యేయంగా పెట్టుకొని, ఆదాయమే తప్ప అన్య ఆలోచనలే లేనివారికి తమ నీడను చూసినా భయమే! అంతులేని ఆశలతో, అవధులు లేని ఆరాటంతో వారి జీవితమంతా అశాంతిమయమే! చీమలు పెట్టిన పుట్టలు పాముల పాలైనట్లు, అత్యాశతో ఆర్జించిన వారి సంపద అనతికాలంలోనే అన్యుల పరమవుతుంది. అందుకే జగద్గురువులు ఆది శంకరాచార్యులు 'భజ గోవిందం' శ్లోక పరంపరలో...

**'అర్థమనర్థం భావయ నిత్యం**
**నాస్తి తతః సుఖలేశః సత్యమ్|**
**పుత్రాదపి ధనభాజాం భీతిః**
**సర్వత్రైషా విహితా రీతిః'||**

'ధనం ఎల్లప్పుడూ అనర్థాన్నే కలిగిస్తుందని గ్రహించు. ధనంతో సుఖం లేశమైనా లేదు. ఇది సత్యం. ధనవంతులు పుత్రుడి వల్ల కూడా భయపడతారు. ప్రపంచమంతా ఈ రీతిగానే ఉంది' అని హితవు పలికారు. ఈ శరీర ఆరోగ్యానికి విఘాతం కలిగించే విధంగా ధనం ఆర్జించకూడదు. కోరికలు తీర్చుకోకూడదు.

## ధర్మాన్ని అనుసరించే కామం

మూడో పురుషార్థం కామం. ధర్మబద్ధ కామం భగవత్ స్వరూపం. అందుకే 'ధర్మానికి లోబడి ఉండే కామాన్ని నేనే' అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ సెలవిచ్చాడు. కన్నూమిన్నూ కానకుండా కామమోహులైతే వినాశనం తప్పదు! ఇందుకు రావణాసురుడే నిదర్శనం. రాముడు యవ్వనంలో స్త్రీ వ్యామోహంపై వైరాగ్యాన్ని వ్యక్తం చేస్తూ 'కేశపాశాలనే చీకట్లతోనూ, చంచల నేత్రాలనే నక్షత్రాలతోనూ, ముఖమనే పూర్ణ చంద్రునితోనూ, నవ్వులనే పువ్వులతోనూ విలసిల్లే కామిని అనే దీర్ఘయామిని పురుషుని బుద్ధిని మోహగ్రస్తం చేస్తుంది. వాళ్లను ధర్మకార్యాల నుంచి విముఖులను చేస్తుంది. చివుళ్ల వంటి చేతులూ, తుమ్మెదల వంటి కన్నులూ కలిగి విషలతను బోలిన కాంత, చెంత చేరిన వాళ్లను ఉన్మాదంతో వివశులను చేస్తుంది' అని హెచ్చరిస్తాడు. మోహాన్ని ప్రేరేపించే ఈ సుందర దేహం ఎప్పటికైనా కాటిపాలు కావాల్సిందే! అయినా మనిషి ఈ అశాశ్వత శరీరం నుంచి ఏదో సుఖాల్ని ఆస్వాదించాలని అర్రులు చాస్తూ ఉంటాడు. ఎంత నీచానికైనా దిగజారుతాడు.

## మోక్షమే లక్ష్యం

ఆఖరి పురుషార్థం మోక్షం... అంటే మోహక్షయం. సద్గురువును ఆశ్రయిస్తే సరైన జ్ఞానం కలుగుతుంది. మోక్షాన్ని కాంక్షించేవారు తొలుత మూడు పురుషార్థాల్ని సముపార్జించాలి. సద్గురువును ఆశ్రయించి ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి. గురుచరణాలపై భక్తిప్రపత్తులతో మెలిగే సాధకుడు సులువుగా సంసార బంధాల నుంచి విముక్తిని పొందుతాడు. అందుకే చాణక్యుడు 'ముక్తిని కోరకుంటే విషయ వాంఛలను విషంతో సమానంగా భావించి విడిచిపెట్టు. సహనశీలత, ధైర్యం, సరళత, వినమ్రత, విశ్వాసం, ఔదార్యం, దయ, పవిత్రత, సత్యాలను అమృతంలా స్వీకరించు' అంటాడు. అహంకారం నుంచి విముక్తులం కావడమే నిజమైన మోక్షం. అందుకే ఓ భక్తుడు రమణ మహర్షితో 'భగవాన్ నేను ముక్తి పొందేదెప్పుడు?' అని ప్రశ్నిస్తాడు. అప్పుడు రమణులు 'ముందు 'నేను' నుంచి ముక్తిపొందు. ఆ తరువాత ముక్తి దానంతట అదే వస్తుంది' అన్నారు. మోక్షం ఎక్కడో పైలోకంలో లభించదు. జీవన్ముక్తులం కావాలి. అదే హైందవ ధర్మం ప్రబోధించేది. అంటే అన్ని బంధాల మధ్య ఉంటూ కూడా నిస్సంగత్వంగా ఉండగలిగితే అదే మోక్షం. అలాగే భగవంతుడికి శరణాగతులైన భక్తులు నిత్యముక్తులు. అందుకే శ్రీనివాసుడికి అంకితమైన అన్నమాచార్య 'కలిగెనిదె నాకు కైవల్యం...' అంటూ పాడుకొని పరవశించాడు.

...✍ మనోజ్ఞ

# ఆలస్యం.. ప్రమాదం కాదు!

**గృహ నిర్మాణ విషయంలో శంకుస్థాపన చేసిన తర్వాత ఏడాదిలోగా గృహప్రవేశం చేయాలని చెబుతారు. నిర్మాణం ఆలస్యమైతే.. ఏమైనా ప్రమాదమా?**

• **శ్రీనివాస్,** కట్టంగూరు





**శంకుస్థాపన** చేసిన తర్వాత ఆ సంవత్సరంలోనే నిర్మాణం పూర్తి చేసి, గృహప్రవేశం చేయాలని శాస్త్ర వచనం! శంకుస్థాపన చేసిన ముహూర్త ప్రభావంతో త్వరితగతిన గృహనిర్మాణం పూర్తవుతుందని నమ్మకం. ఏడాదిలోపు గృహప్రవేశం చేయాలన్న నియమం వల్ల.. ఇంటి పనుల విషయంలో యజమాని వేగవంతంగా వ్యవహరించే అవకాశాలూ ఉంటాయి. ఒకవేళ అలా పూర్తికాని పక్షంలో దోష పరిహారం కోసం శాస్త్ర నిపుణులు కొన్ని పరిహారాలు సూచించారు. వాటిని నిర్వహించి తదుపరి ప్రక్రియ కొనసాగించవచ్చు. అయితే, ఏడాదిలోపు నిర్మాణం పూర్తికానంత మాత్రాన వచ్చిపడే ప్రమాదమేదీ లేదు.

# మేరాజ్ కానుక.. నమాజ్

## బుధవారం షబే మేరాజ్

**ఒకానొకసారి** యుద్ధంలో హజ్రత్ అలీ (రజి)కి విషపు బాణాలు గుచ్చుకుంటాయి. ఆయన్ను చెట్టుకు కట్టేసి బాణాలు తొలగిద్దామని వైద్యుడు సూచిస్తాడు. దానికి హజ్రత్ అలీ ఒప్పుకోరు. బాణాలు తీసే క్రమంలో నొప్పి భరించలేనంతగా ఉంటుందన్నాడు వైద్యుడు. 'అయితే, నేను నమాజ్‌లో లీనమైనప్పుడు బాణాలు తొలగించండి' అన్నారు హజ్రత్ అలీ. అంతలోనే నమాజ్ వేళయింది. హజ్రత్ అలీ ప్రార్థనకు పూనుకున్నారు. అప్పుడు వైద్యులు బాణాలను తొలగించారు. నమాజ్‌లో ఉన్న హజ్రత్ అలీ (రజి) బాణాలు తొలగించిన సంగతిని కూడా గుర్తించలేదు. ప్రార్థనా సమయంలో శ్రద్ధాభక్తులు ఎలా ఉండాలో వివరించడానికి ఉలేమాలు ఈ కథను ఉటంకిస్తారు.

ఇస్లామ్ ఐదు మూల స్తంభాల్లో నమాజ్ ఒకటి. అల్లాహ్‌ను విశ్వసించే వారు ఐదు పూటలా నమాజ్ విధిగా చేయాలన్నది దైవ ఆదేశం. అల్లాహ్ ఆదేశాలు, ఇస్లామ్ ధర్మ విధి విధానాలు జిబ్రీల్ దూత ద్వారా ముహమ్మద్ ప్రవక్త (స) వరకూ చేరాయి. అవన్నీ ఖురాన్ రూపంలో నిక్షిప్తంగా ఉన్నాయి. ఐదు పూటలా చదివే నమాజ్ ప్రవక్తకు అల్లాహ్ ఇచ్చిన కానుక. జిబ్రీల్ దూత ప్రవక్తను రాత్రికి రాత్రి సప్త ఆకాశాల పైనున్న అల్లాహ్ దగ్గరికి తీసుకెళ్లాడు. అక్కడ అల్లాహ్ నమాజ్‌ను ప్రవక్తకు కానుకగా అందించాడు. ఈ అపురూప ఘటన జరిగిన రోజును 'షబే మేరాజ్'గా ముస్లిమ్‌లు జరుపుకొంటారు. ఇస్లామియా కాలమానం ప్రకారం రజబ్ నెల 27వ తేదీన ఈ ఘటన జరిగింది. ఇస్లామ్ చరిత్రలో, ఖురాన్ గ్రంథంలో షబే మేరాజ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. అందుకే, ముస్లిమ్‌లు ఐదు పూటలా విధిగా నమాజ్ చేయాలని ప్రవక్త ఉద్బోధ. నిర్ణీత వేళల్లో నమాజ్ చేసేవారంటే అల్లాహ్‌కు ఎంతో ప్రీతి అని ప్రవక్త (స) చెప్పేవారు.



..✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# ప్రశాంతత

కథాసుధ

**ఒక** ఆశ్రమంలో గురువు, గురుపత్ని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. గురుపత్నికి ఓ అనుమానం వచ్చి 'స్వామీ ఈ లోకంలో ప్రశాంతంగా జీవించేవారు ఎవరు?' అని భర్తను అడిగింది. దానికి ఆయన 'నీ దృష్టిలో ఎవరు ప్రశాంతంగా ఉంటున్నారో చెప్పు' అని అడిగాడు. దానికామె 'సర్వం ఎరిగినవారు మీరే చెప్పాలి' అంది. 'ముందుగా నీ అభిప్రాయం వెల్లడించు' అన్నాడు గురువు. 'మీరు అడిగారు కాబట్టి చెబుతున్నా! పుష్కలంగా ధనం ఉన్నవాళ్లే! వారి కోరికలు అన్నీ తీరుతాయి. ఏ సమస్యా లేకుండా ఉంటారు. అలాంటి వారే ప్రశాంతంగా జీవించగలుగుతారు' అని బదులిచ్చింది గురుపత్ని. దానికి



గురువు నవ్వి 'నీ ఊహ తప్పు దేవీ! ధనం పాపిష్టిది. దాని కోసం ఎందరినో నమ్మించి, ద్రోహం చేయాల్సి వస్తుంది. లౌకికమైన కోరికలు డబ్బుతో తీరుతాయి. రోగాన్నీ డబ్బుతో నయం చేసుకోవచ్చు. కానీ, ఎంత డబ్బున్నా.. వ్యాధి వల్ల కలిగే బాధను అనుభవించక తప్పదు కదా!' అని బదులిచ్చాడు. 'మరి ప్రశాంతంగా ఉండేది ఎవరు స్వామి?' అని మళ్లీ అడిగింది గురుపత్ని. 'లాభనష్టాల్లో, సుఖదుఃఖాల్లో భగవంతుణ్ని విస్మరించని వాడే ప్రశాంతంగా జీవించగలడు. జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులు, దైవం పట్ల ఎవరైతే కృతజ్ఞతా భావంతో ఉంటారో వాళ్లే ప్రశాంత జీవనం సాగించగలరు' అని చెప్పాడు. 'వారికీ కష్టాలు వస్తుంటాయి కదా! ఇక ప్రశాంతత ఎక్కడ ఉంటుంది' అని అడిగిందామె! 'ఆ కష్టంలోనూ భగవంతుణ్ని నమ్ముకున్నవాడికి ఏ బాధలూ ఉండవు. సంపదతో కలగని ప్రశాంతత భగవత్ సాన్నిధ్యంతో లభిస్తుంది' అని వివరించాడు గురువు.

...✍ కనుమ ఎల్లారెడ్డి, 93915 23027